క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న జైపాల్‌రెడ్డి

రాయికల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలం ఒడ్డె లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు అవగాహన కల్పించి సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సతీశ్, హెచ్ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి చేయూత



బిర్యాని పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాలరూరల్: మహిళ సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఏపీఎం గంగాధర్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని తాటిపల్లి, అంతర్గాం, హస్నాబాద్ గ్రామాల్లో సెర్ప్, ఐకేపీ ద్వారా మహిళ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు గంగారాం, రవీందర్, అర్బన్ మహిళ సంఘం అధ్యక్షురాలు గంగజల, కార్యదర్శి జమున, వీవోఏలు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జగిత్యాల: జిల్లాలో కొన్ని పాఠశాలల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోరుట్లలో ఓ ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థుల అడ్మిషన్ల కోసం తోక పేర్లు వాడతున్నారని, వాటిని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జీవో నంబరు 91, 92, 93 ప్రకారం పాఠశాలల్లో 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామచంద్ర, సంజయ్, విఘ్నేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: పంట సాగు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదెకరాల్లో ప్రకృతి వనం ఏర్పాటు

సారంగాపూర్:రేచపల్లి గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో 10 ఎకరాల విస్తీర్ణంలో బృహత్ ప్రకృతి వనం ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీవో రఘువరన్ అన్నారు. మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో ఖాళీ ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 556లో పదెకరాల విస్తీర్ణంలో బృహత్ ప్రకృతి వనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వహీద్, ఎంపీడీవో చౌడారపు గంగాధర్, రవికుమార్, ఈజీఎస్ ఏపీవో లత, సిబ్బంది పాల్గొన్నారు.



గతేడాది వర్షానికి కల్వర్టుపై నుండి ఉధృతిగా ప్రవహిస్తోన్న నీరు(ఫైల్)



వాగు ఉధృతికి కోతకు గురైన రహదారి(ఫైల్)

వాగు దాటాలంటే వణుకే

- ఏఎస్ఆర్ తండా వాసులకు వానాకాలం తిప్పలే
- వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు

మెట్‌పల్లిరూరల్: వానాకాలం వచ్చిందంటే మెట్‌పల్లి మండలంలోని అల్లూరి సీతారామరాజు తండా (ఏఎస్ఆర్ తండా) వాసుల కష్టాలు అంతా.. ఇంతా కాదు. భారీ వర్షాలు కురిసిన సమయంలో గ్రామ శివారులోని వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగుమీది నుంచి ప్రయాణించాల్సి వస్తోంది.వర్షాకాలం సమయంలో రోజుల తరబడి ఇక్కడి ప్రాంత ప్రజలకు రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయంగా ఉన్న మరో రహదారి గుండా వెళ్లానుకున్నా అటువైపు ప్రాంతంలోని చెరువు నిండి రహదారి కోతకు గురవుతోంది. ఏళ్ల తరబడి ఈ పరిస్థితి ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదు.పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టు స్థానంలో వంతెన నిర్మించేందుకు పంచాయతీరాజ్ నుంచి రూ.81 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఈసారి కూడా తమకు కష్టాలు తప్పేలాలేవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్,కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చొరవ తీసుకొని తమ కష్టాలు తీర్చాలని గ్రామస్తులు,స్థానికులు వేడుకుంటున్నారు.



దెబ్బతిన్న కల్వర్టు



కథలాపూర్: మండలంలోని దూలూర్- బొమ్మెన గ్రామాల మధ్య దుర్గామాత ఆలయం వద్ద వాగుపై నిర్మించిన కల్వర్టు తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షం కురిస్తే నీళ్లు కల్వర్టు పైనుంచి పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని ప్రజలు తెలిపారు. ఇక్కడ హై లెవెల్ కల్వర్టును నిర్మిస్తే సమస్య తీరుతుందన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఏఈ ఆర్‌అండ్‌బీ, కథలాపూర్ సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులదే కీలక పాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై కిరణ్ కుమార్

వెల్గటూర్ : డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులే కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు డ్రగ్స్‌కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రాంనర్సింహారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్తంభంపల్లి బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ హరితరెడ్డి, పోలీస్ సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి:డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్సై కిరణ్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్లో మంగళవారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్యాల: విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకూడదని, డ్రగ్స్ నియంత్రణపై ఎస్సై నరేశ్‌కుమార్ అల్ఫోర్స్ ఎస్ఎస్‌వీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో కలిగే దుష్పరిణమాలపై విద్యార్థులతో చిత్రాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు,పోలీసులు పాల్గొన్నారు.

రాయికల్: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎస్సై సుధీర్‌రావు అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాయికల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం అయోధ్య గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా అనారోగ్యానికి గురవుతున్నారని, మత్తు పదార్థాల అనర్థాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుప్రియ, రాహుల్, ఝాన్సీ, ఏఎన్ఎం లత, సంగీత పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు జమ చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు గడ్డం గంగారెడ్డి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని సర్వేనంబరు 437, 251లో గల భూములకు రైతుభరోసా నిధులు జమ చేయాలని బుధవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు గడ్డం గంగారెడ్డి, జక్కుల మహేశ్, మంగలారపు రమేశ్, ఇందూరి శ్రీనివాస్ గ్రామపంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

వరకట్నం కేసు నమోదు

మల్యాల: అదనపు వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, కుటుంబ సభ్యులపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన తాడుక సాత్విక అలియాస్ కాసర్ల హన్వికను గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లికి చెందిన కాసర్ల కల్యాణ్‌కు ఇచ్చి ఏడాది క్రితం వివాహం చేశారు. కొద్దిరోజుల నుంచి భర్త కల్యాణ్‌తోపాటు కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. అదనపు కట్నం తీసుకురాకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని హన్విక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ట్రక్కు

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్ శివారులో పెద్దమ్మ గుడి వద్ద బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జగిత్యాల వైపు వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ట్రక్కు డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం



బెల్టులు ప్రదానం చేస్తున్న వసంతకుమార్

పెగడపల్లి: ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కరాటే మాస్టర్ రాజశేఖర్ నెల రోజుల పాటు మండల కేంద్రంలో నిర్వహించిన కరాటే శిక్షణ సమ్మర్ క్యాంపు ముగిసింది. ఈ సందర్భంగా మంగళవారం శిక్షణలో పాల్గొన్న 34 మంది విద్యార్థులకు మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కరాటే గ్రాండ్ మాస్టర్ వసంత్ కుమార్ పర్యవేక్షణలో కరాటే గ్రేడింగ్ టెస్టులను నిర్వహించారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే బ్లాక్ మాస్టర్లు క్యాస రాజశేఖర్, క్యాస అర్చన, ప్రిన్సిపాల్ వేణు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధులకు సన్మానం



షమియొద్దీన్ సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు జగిత్యాలకు చెందిన యోధులు షమీయుద్దీన్, పుప్పాల సత్యనారాయణ, బండారు మల్లికార్జున్, ఏసీఎస్ రాజులను బుధవారం భారత్ సురక్షా సమితి నాయకులు సన్మానించారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ దురహంకారంతో దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను హరించిందన్నారు. కార్యక్రమంలో మ్యాన మహేష్, అక్కినపెల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, కొత్తకొండ బాలయ్య, బోగ దేవన్న,తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ బాధితులకు సన్మానం

ధర్మపురి: ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎమర్జెన్సీలో ఇబ్బంది పడ్డ బాధితులను బుధవారం ధర్మపురిలో బీజేపీ నాయకులు సన్మానించారు. లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తిని సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో సుమారు 21 నెలలు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేసారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఓగేటి అంజన్న, ప్రధాన కార్యదర్శి వినోద్, స్తంభంకాడి శ్యామ్ తదితరులున్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రఘు

జగిత్యాలటౌన్: ఈనెల 29న నిజామాబాద్‌లో జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు కోరారు. బుదవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నలువాల తిరుపతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల: నిజామాబాద్‌లో ప్రారంభమయ్యే పసుపు బోర్డు ప్రారంభానికి బీజేపీ శ్రేణులు బారీగా తరలి రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు అన్నారు.

మెట్‌పల్లి: నిజామాబాద్ పట్టణంలో ఈ నెల 28న జరిగే రైతు సమ్మేళనం కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చిట్నేని రఘు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు యాదగిరిబాబు, నాయకులు చెట్లపల్లి సుఖేందర్, వడ్డెపల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

మల్లాపూర్: పసుపుబోర్డు కేంద్ర కార్యలయ ప్రారంభోత్సవానికి రైతులందరూ తరలిరావాలని బీజేపీ రాష్ట్ర మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. 29న నిజామాబాద్‌కి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి పీసు రాజేందర్, బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్,కాంతయ్యచారి, తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన బీజేపీ నాయకులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌ను బీజేపీ పట్టణ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీపెల్లి రవీందర్, ఏసీఎస్ రాజు, లింగంపేట శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కోరుట్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు భారత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సీ. ప్రభాకర్ భవన్‌లో బుధవారం సీపీఐ పట్టణ 11 వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులకు నివాళి అర్పించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న మహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, నాయకులు మౌలానా, చెన్నా విశ్వనాథం, ముఖ్రం, తదితరులు పాల్గొన్నారు.

యాదవులందరూ సభ్యత్వం తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: యాదవ కులస్తులందరూ సంఘం సభ్యత్వాలు తీసుకోవాలని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గణవేని మల్లేశ్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సమావేశం నిర్వహించి యాదవుల సంఘ సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ముక్కెర భీమయ్య, పంతంగి చిన్న వెంకట్, ముద్దం చిన్న నర్సయ్య, ఓర్రె మహేందర్, ముద్దం చిన్న మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఉండాలి

సారంగాపూర్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని ఎస్సై గీతారెడ్డి అన్నారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సహకారం ఉంటే మండలాన్ని ప్రశాంతంగా, అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చన్నారు. ర్యక్రమంలో నాయకులు బేతి శంకర్‌రెడ్డి, కోండ్ర రాంచంద్రారెడ్డి, ఎండి ఇబ్రహీం, బొడ్డుపల్లి రాజన్న, ఆకుల రాజిరెడ్డి, మాలెపు సుధాకర్, కొక్కు గంగారాం తదితరులు ఉన్నారు.

విద్యార్థులు చదువులపైనే దృష్టి పెట్టాలి

సారంగాపూర్: విద్యార్థులు చదవుపైనే తమ దృష్టి పెట్టాలని సారంగాపూర్ ఎస్సై గీతారెడ్డి అన్నారు. బుధవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె విద్యార్థులు మాదక ద్రవ్యాలు, ఫోన్లు, చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై. రమేశ్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

మెట్‌పల్లి: అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం 52మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మకుండా స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్దన్, నాయకులు వాకిట సత్యంరెడ్డి, ఖుత్బొద్దీన్, రుత్త నారాయణ, కొమ్ముల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి అక్రమణపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన పలువురు మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 619లో 32 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో కొంత భూమి నాటి కాలం నుంచి పశువులు,ఇతర గ్రామ అవసరాల కోసం వాడుకుంటున్నమన్నారు.అయితే గ్రామానికి చెందిన పొన్నం తిరుపతిగౌడ్ అనే వ్యక్తి అందులోని 5 ఎకరాల భూమిని ఆక్రమించి చదును చేశాడని బుధవారం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు.ఆక్రమణకు గురైన భూమిని కాపాడి,అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు వాటర్ డిస్పెన్సరీ వితరణ

రాయికల్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ జేఏసీ కార్యాలయానికి బుధవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషన్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సరీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల నర్సయ్య, జెడ్పీలు మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆవరణ పరిశుభ్రం

ధర్మపురి: పిచ్చిమొక్కలు ముళ్ల కంచెలతో పెరిగిన ప్రభుత్వ పాఠశాల ఆవరణను బుధవారం బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం చేశారు. మండలంలోని నేరెల్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగి విద్యార్థుల ఆటలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాశారపు బాలాగౌడ్, మండల అధికార ప్రతినిధి జాజాల రమేష్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ద్వారా పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మైదాన పనులను శుభ్రం చేశారు.

రుణమాఫీ లబ్ధిదారుల జాబితా ఫ్లెక్సీలతో ప్రదర్శన

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో పంట రుణమాఫీ అయిన లబ్ధిదారుల జాబితాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలపై రాయించి ప్రదర్శిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని 19 గ్రామాల్లో 4,329 మంది రైతులకు పంట రుణాలు రూ. 36.87 కోట్లు మాఫీ అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రుణమాఫీ అయిన రైతుల పేర్లు, మాఫీ అయిన డబ్బుల వివరాలను ఫ్లెక్సీలల్లో రాయించి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రదర్శించారు. ఫ్లెక్సీలను చూసి అందులో పేర్లున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా ప్రవీణ్

పెగడపల్లి: సీపీఐ మండల నూతన కమిటీని మంగళవారం నియమించినట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరుగురాల భూమేశ్వర్ తెలిపారు. మండల కార్యదర్శిగా శనిగరపు ప్రవీణ్, సహాయ కార్యదరుల్శుగా రాచర్ల సురేశ్, గుడ్ల శ్రీనివాస్, కోశాధికారిగా దీకొండ రవికుమార్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. అనంతరం జరిగిన సీపీఐ 9వ మండల మహాసభ సమావేశంలో భూమేశ్వర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సమరశీల పోరాటం చేయాలన్నారు. ఇందిరమ్మ పథకం కింద పార్టీలకతీతంగా నిరుపేద కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. సమస్యల పోరాటానికి కార్మికులంతా ఐక్యమత్యంగా పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో మండల కార్మిక సంఘం నాయకులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన న్యాయవాది టీపీసీసీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ , సమాచార హక్కు విభాగం కమిటీ రాష్ట్ర జయింట్ కన్వీనర్‌గా ఎంపికైన కోటగిరి వెంకటస్వామిని బుధవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడపెల్లి వెంకటస్వామి, మాజీ అధ్యక్షుడు బూరం సంజీవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండలంలోని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 18 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ సింధూశర్మ, ఏఈ ప్రవీణ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఆదేశం

సాక్షి స్పందన

రాయికల్: బల్దియాలోని 7వ వార్డులోని పెద్ద చెరువు వద్ద ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌ను బుధవారం ఆదేశించారు. ఈనెల 16న 'సాక్షి'లో 'అభివృద్ధి పనులకు గ్రహణం' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి 7వ వార్డులో సీడీఎంఏ నిధుల ద్వారా ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్ కోసం రూ.కోటి మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు మరమ్మతుల కోసం ఎమ్మెల్యేకు వినతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి నుంచి చిన్న కొల్వాయి వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కొల్వాయి బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు ధ్వంసమైందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.